పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 26.07.2014

2004 నుండి 2014 సంవత్సరం వరకు దశాబ్ద కాలం పాటు రాష్ట్ర గృహ నిర్మాణ పథకంలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరపాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సిబిసిఐడి కి అప్పగించింది. గృహనిర్మాణ పథకంలో కేవలం 2006-2014 సంవత్సరం మధ్యలోనే 22 లక్షల 40 వేల గృహాలు కట్టబడ్డాయని లెక్కలు చెపుతున్నప్పటికి వీటిలో ఎన్ని కట్టబడింది? ఎన్ని కట్టబడలేదు? అనే విషయంలో స్పష్టత లోపించిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులతో ముఖ్యమంత్రి జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులు గృహనిర్మాణాల విషయంలో జరిగిన అవకతవకలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వాల హాయాంలోనే ఈ అవకతవకలను కొంత వరకు గుర్తించిన గత ప్రభుత్వం థర్డ్ పార్టీ విచారణ, శాఖాపరమైన విచారణ జరిపిందని, 490 మంది అధికారులను సస్పెండ్ చేశారని, మరో 285 మందిని డిస్మిస్ చేశారని, వీరిలో కొంతమంది ఇంకా జైల్లోనే వున్నారని అధికారులు తెలియజేశారు. చాలా మంది నాయకులపై కూడా కేసులు పెట్టటం వలన వారు జైలుకు వెళ్లి బేయిల్‌పై విడుదలయ్యారని అధికారులు అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తన ఆదేశాల మేరకు 593 గ్రామాలలో ర్యాండమ్ విచారణ జరుపగా రూ.235 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు బయటపడిందని, కట్టబడినట్లు చెబుతున్న 36 వేల ఇండ్లు అసలు కట్టడమే జరుగలేదని, కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులు క్లేయిమ్ చేశారని ముఖ్యమంత్రి అన్నారు. అసలు జరిగిన అవకతవకలన్నీ 75 శాతం మేర 2008-2009 సంవత్సరాల మధ్య కాలంలోనే జరిగాయని, ఆ పీరియడ్‌లో గృహ నిర్మాణ సంస్థకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రూ.5500 కోట్లని, మంజూరయిన ఇళ్ల సంఖ్య 13 లక్షలని ముఖ్యమంత్రి అన్నారు. ఇంత పెద్ద ఎత్తున జరిగిన దుర్వినియోగం ఆ తరువాత కాలంలో కూడా విచ్చలవిడిగా కొనసాగిందని ముఖ్యమంత్రి అన్నారు. తాను ఈ విషయాలను శాసనసభ దృష్టికి తీసుకువచ్చినప్పుడు శాసనసభలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని ముక్త కంఠంతో తనను కోరారని, తాము ఈ విషయంలో పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. విచిత్రం ఏమిటంటే కొన్ని గ్రామాలలో గ్రామం మొత్తం ఇళ్లు కట్టబడి

వున్నప్పటికి, 99 శాతం మందికి ఇళ్లు కట్టిచ్చి ఇచ్చామని చెప్పినప్పటికి వాస్తవానికి ఒక్క ఇల్లు కూడా కట్టిన దాఖాలాలు లేవని ఆయన అన్నారు. ఉదాహరణకు ఆదిలాబాద్ నియోజకవర్గంలో 45,000 ఇళ్లు, మంథని నియోజకవర్గంలో 41,099 ఇళ్లు, కొడంగల్ నియెజకవర్గంలో 32,337 ఇళ్లు, పరిగి నియెజకవర్గంలో 30,416 ఇళ్లు కట్టబడినట్లు లెక్కలు చెపుతున్నాయి. అన్ని కుటుంబాలకు ఇళ్ల వసతి కల్పించినట్లు కూడా చెప్పారు. వాస్తవానికి అవన్నీ తప్పుడు లెక్క లేనని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటివి కాకుండా మరో 4,60,000 ఇళ్లు ఇంకా నిర్మాణంలో వున్నాయని కూడా లెక్కలు చెపుతున్నాయన్నారు.

ఒక్క గృహనిర్మాణ విషయంలోనే కాకుండా పెన్షన్ల వ్యవహారంలోనూ, ఫీజు రీ ఇంబర్స్ మెంట్ వ్యవహారంలోనూ, రేషన్ కార్డుల వ్యవహారంలోనూ, తదితర అనేక విషయాల్లోనూ ఒక రకమైన భయానక పరిస్థితి నెలకొని వుందని, అవినీతి తారా స్థాయికి చేరుకున్నదని ముఖ్యమంత్రి అన్నారు. ఎవరు అసలైన లబ్దిదారులో? ఎవరు కారో? అనే విషయం బయటపడాలన్నారు. ప్రభుత్వం కొత్తగా కట్ట దలుచుకున్న రెండు బెడ్ రూముల ఇళ్ల విషయంలో ఇలాంటి విషయాలపై కఠినంగా వుండాలని, అవినీతికి తావు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. మొత్తం వ్యవహారాన్ని ప్రక్షాళన చేయవలసిన అవసరం వుందని, అలా చేయకుండా కట్టిస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని, అందుకే ఇది తేల్చడానికి సిబిసిఐడి విచారణకు ఆదేశించామని ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్తులో ఒక్క పైసా దుర్వినియోగం జరిగినా శిక్ష తప్పదన్న భయం కలగాలని ఆయన అన్నారు. త్వరలోనే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాపంగా వున్న 83,59,000 కుటుంబాలకు సంబంధించి సమగ్ర సర్వే జరుపుతుందని ఆయన అన్నారు. అవినీతి అక్రమాలకు భవిష్యత్తులో తావులేకుండా వుండేందుకు ఈ సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

ప్రభుత్వం లోని నాలుగు లక్షల మంది ఉద్యోగుల ద్వారా కేవలం ఒకే ఒక్క రోజు పూర్తయ్యే విధంగా రాష్ట్ర వ్యాప్త సమగ్ర సర్వే జరుగుతుందని, దాని కొరకు జిల్లా కలెక్టర్లతో, జాయింట్ కలెక్టర్లతో, ఆర్డిఒలతో, తహశీల్దారులతో ఆగష్టు ఒకటి 2014న హైదరాబాద్ లో ఒక సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేశారు. సమగ్ర సర్వే తరువాత అసలు సిసలైన లబ్దిదారులను గుర్తించి గృహ నిర్మాణ పథకం అమలు చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు.

---------------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం.